
ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం 25 మే 2025





## చెడు కొలెస్ట్రాల్ వదిలించుకోవడానికి 5 సింపుల్ చిట్కాలు..

ఈ రోజుల్లో ప్రజల జీవనశైలి, ఆహారపు అలవాట్లు మారిపోయి. బిజీ లైఫ్ వల్ల చాలామంది బీపీ, షుగర్ వంటి జీవనశైలి వ్యాధుల బారిన పడుతున్నారు. చెడు కొలెస్ట్రాల్ అనేది కూడా జీవనశైలి సరిగా లేకపోవడం వల్ల వచ్చే సమస్యే. వాస్తవానికి, "చెడు కొలెస్ట్రాల్" ధమనుల గోడలపై పేరుకుపోతుంది. దీనివల్ల ధమనులు గట్టిగా, ఇరుకుగా మారుతాయి. ఇది రక్త ప్రవాహాన్ని తగ్గిస్తుంది. తద్వారా గుండెకు రక్తం, ఆక్సిజన్ సరఫరా తగ్గిపోయి గుండె జబ్బులు, స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతుంది. ఇలాంటి సమస్య రాకూడదంటే చెడు కొలెస్ట్రాల్ నియంత్రించడానికి మీరు ఈ కింది టిప్స్ ప్రయత్నించవచ్చు.

**ఓట్స్**

ఓట్స్ గుండె ఆరోగ్యానికి చాలా మంచివి. ఎందుకంటే వీటిలో కరిగే ఫైబర్, ముఖ్యంగా బీటా-గ్లూకాన్ అధికంగా ఉంటాయి. ఈ ఫైబర్ చెడు కొలెస్ట్రాల్‌ను జీర్ణవ్యవస్థలోకి తీసుకొస్తుంది. రక్తప్రవాహంలో వెళ్లకుండా నిరోధిస్తుంది. కాబట్టి ఉదయం అల్పాహారంలో ఓట్స్‌ను చేర్చుకోండి.

**వేగంగా నడక**

వ్యాయామం గుండె ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. అలాగని అతిగా నడవాల్సిన అవసరమూ లేదు. వారానికి ఐదు రోజులు వేగంగా 30 నిమిషాల నడక చాలు. మంచి కొలెస్ట్రాల్‌ను పెరిగుతుంది. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గుతుంది. నడక రక్త ప్రవాహాన్ని మెరుగుపరుస్తుంది. మీ శరీరంలోని అదనపు కొలెస్ట్రాల్‌ను బయటకు పంపడంలో సహాయపడుతుంది. సమయం తక్కువగా ఉంటే భోజనం తర్వాత 15 నిమిషాల పాటు నడవండి. రెండు సెషన్‌లుగా విభజించుకుని నడిస్తే మరీ మంచిది.

**డ్రై ఫ్రూట్స్**

మీ గుండె ఆరోగ్యంగా ఉండటానికి డ్రై ఫ్రూట్స్ ఆహారంలో చేర్చుకోండి. బాదం, వాల్‌నట్స్, వేరుశెనగలు, అవిసె గింజలు వంటి నట్స్, డ్రై ఫ్రూట్స్ గుండె ఆరోగ్యానికి మంచివి.

**ఆలివ్ నూనె**

ఆలివ్ నూనె శరీరంలో మంచి కొలెస్ట్రాల్‌ను నిర్వహిస్తుంది. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. మీరు దీనిని కూరగాయలను వేయించడానికి లేదా సలాడ్‌లపై చల్లుకోవడానికి లేదా తృణధాన్యాల బ్రెడ్‌కు డిప్‌గా ఉపయోగించవచ్చు.

**గ్రీన్ టీ**

గ్రీన్ టీ సేవించడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. కొలెస్ట్రాల్‌తో పోరాడడంలో ఇది ప్రభావవంతంగా పనిచేస్తుంది. గ్రీన్ టీలో కనిపించే కాటెచిన్‌లు శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు. ఇవి LDL కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. దాని ఆక్సీకరణను నిరోధిస్తాయి. ప్రతిరోజూ 2-3 కప్పుల తియ్యని గ్రీన్ టీ తాగడం వల్ల LDL దాదాపు 2-5% తగ్గుతుంది.

# ఇవి తింటే వేగంగా బరువు తగ్గుతారు..

ప్రస్తుత కాలంలో సరికాని జీవన శైలి కారణంగా చాలా మంది ఊబకాయం, స్థూలకాయం సమస్యలతో బాధపడుతున్నారు. అధిక బరువుతో అవస్థలు పడుతున్నారు. పెరిగిన బరువును తగ్గించుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు. జిమ్ సెంటర్లు, యోగా సెంటర్లు, కాస్మోటిక్ సెంటర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే, మన తినే ఆహారం బరువు తగ్గించడంలో చాలా ఉపకరిస్తుందని చాలా కొద్దిమందికి మాత్రమే తెలుసు. ముఖ్యంగా కొన్ని రకాల కూరగాయలు, ఫలాలు రోజువారీ ఆహారంలో చేర్చుకుంటే గణనీయంగా బరువు తగ్గే అవకాశం ఉంటుంది. ఎందుకంటే.. వీటిలో సహజంగానే కేలరీలు తక్కువగా ఉంటాయి. కానీ, ఫైబర్, ప్రోటీన్స్, ఆరోగ్యకరమైన కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. ఇవి మీ కడుపు నిండిన ఫీలింగ్ కలిగించడంతో పాటు.. వేగంగా బరువును తగ్గించడంలో ఉపకరిస్తాయి. వీటిని తినడం వలన రక్తంలో చక్కె స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. జీవక్రియను పెంచుతాయి. శరీరంలో అదనపు కేలరీలు స్టోర్ అవ్వగుండా.. శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలన అందిస్తాయి. మీరు కూడా బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్నారా.. ఈ 9 రకాల పండ్లు, కూరగాయలు, ఆహార పదార్థాలు తింటే వేగంగా బరువు తగ్గే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మరి రోజువారీ హారంలో తప్పనిసరిగా చేర్చుకోవాల్సిన ఆ తొమ్మిది ఆహార పదార్థాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం..

**1. ఆకుకూరలు**

ఆకుకూరల్లో కేలరీలు, కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉంటాయి. ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. శరీరంలో అదనపు కేలరీలను పెంచకుండా.. ఆరోగ్యాన్ని ఇస్తుంది. ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తాయి. వాటిలో ఉండే అధిక ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియకు సహాయపడుతుంది. చాలా మంది ఎదుర్కొనే కడుపు ఉబ్బరం సమస్యను తగ్గిస్తుంది.

**2. ఓట్స్**

ఓట్స్.. కరిగే ఫైబర్‌తో కూడిన తృణధాన్యం. ముఖ్యంగా బీటా-గ్లూకాన్ ఇందులో ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కడుపు నిండినట్లుగా ఉంచుతుంది. రోజు ఉదయం ఓట్ మీల్ తీసుకుంటే.. అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. అతిగా తినకుండా నిరోధిస్తుంది. రోజంతా చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుతుంది.

**3. పెరుగు (గ్రీక్ యోగర్ట్)**

గ్రీకు పెరుగులో ప్రోటీన్ అధికంగా ఉంటుంది. ఇది తినడం వల్ల కడుపు నిండిన ఫీలింగ్ ఉంటుంది. బరువు తగ్గే సమయంలో కండరాలకు శక్తిని



ఇస్తుంది. పేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. వాపును తగ్గిస్తుంది. జీర్ణక్రియకు సహాయపడే ప్రోబయోటిన్స్ కూడా పుష్కలంగా ఉంటాయి. బరువు తగ్గించడంలో ఇది చాలా ఎఫెక్టీవ్‌గా పని చేస్తుంది.

**4. గుడ్లు**

పోషకాహారాల్లో గుడ్డు చాలా కీలకమైంది. గుడ్లలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అధిక-నాణ్యత ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, శరీరానికి అవసరమైన విటమిన్లు ఇందులో ఉంటాయి. అల్పాహారంలో గుడ్లు తినడం వల్ల కడుపు నిండిన భావన పెరుగుతుంది. అధికంగా ఆహారం తినడకుండా ఉండటంలో సహకరిస్తుంది. హార్మోన్లను నియంత్రించడంలో సహాయపడుతుంది.

**5. చియా గింజలు**

చియా గింజలు వాటి బరువు కంటే చాలా రెట్లు నీటిని గ్రహిస్తాయి. వీటిని తింటే.. కడుపు నిండిన అనుభూతి కలుగుతుంది. చియా గింజల్లో ఫైబర్, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. చియా సీడ్స్‌ని స్మూతీ, పెరుగు, ఓట్ మీల్‌లో కలిపి తినొచ్చు.

**6. అవకాడోలు**

అవకాడోలో కేలరీలు అధికంగా ఉన్నప్పటికీ.. ఆరోగ్యకరమైన మోనోశాచురేటెడ్ కొవ్వులు, ఫైబర్ సమృద్ధిగా ఉంటాయి. ఈ రెండూ సంతృప్త, బొడ్డు కొవ్వును తగ్గించడంలో సహాయపడుతాయి. అవకాడోలో పొటాషియం కూడా ఉంటుంది. ఇది శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుంది. ఎలక్ట్రోలైట్‌లను సమతుల్యం చేస్తుంది. శరీంలో కొవ్వు తగ్గడానికి సహాయపడుతుంది.

**7. బెర్రీలు**

బెర్రీలు కేలరీలు తక్కువగా ఉంటాయి. కానీ, ఇందులో ఫైబర్, విటమిన్లు, శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. శరీరంలో షుగర్ లెవల్స్‌ని నియంత్రణలో ఉంచుతుంది. బరువు తగ్గడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

**8. తృణ దాన్యాలు, డ్రై ఫ్రూట్స్..**

తృణ దాన్యాలలో ప్రోటీన్స్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్ ఉంటుంది. తృణ దాన్యాలను తినడం వలన ఆరోగ్యకరమైన బరువు తగ్గే అవకాశం ఉంటుందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి.

**9. చిక్కుళ్ళు..**

చిక్కుళ్ళు మొక్కల ఆధారిత ప్రోటీన్. ఇందులో కరిగే ఫైబర్ ఉంటుంది. ఇది నెమ్మదిగా జీర్ణం అవుతుంది. దీంతో ఎక్కువ సమయం కడుపు నిండిన ఫీలింగ్ ఉంటుంది. ఆకలిని నియంత్రంలో సహాయపడుతుంది. రక్తంలో షుగర్ లెవల్స్‌ని కూడా స్థిరంగా ఉంచుతుంది. బరువు తగ్గడంలో సహకరిస్తుంది.

అన్నికంటే ముఖ్యమైన విషయం ఏంటంటే.. క్రమం తప్పకుండా శారీరక శ్రమ చేయడం సమతుల భోజనం తినడం, పోషకాలు నిండిన ఆహారం తినడం వలన స్థిరమైన, ఆరోగ్యకరమైన బరువు తగ్గే అవకాశం ఉంటుంది.

# షుగర్ కంట్రోల్ కావాలంటే కాకరకాయ ఇలా తినండి..

ఈ రోజుల్లో ఎక్కువమంది ప్రజలు డయాబెటిస్, అధిక యూరిక్ యాసిడ్ వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఈ వ్యాధులు తీవ్రమైతే ఇతర ప్రాణాంతక వ్యాధులు చుట్టుముట్టే అవకాశముంది. కాబట్టి, వీటిని నియంత్రించుకోవడం చాలా అవసరం. అయితే, మందులతో పని లేకుండా కేవలం ఒకే ఒక్క కూరగాయతో ఈ రెండు సమస్యలకూ చెక్ పెట్టవచ్చు. అదే కాకరకాయ. ఈ ఒక్కటి ఆహారంలో భాగం చేసుకుంటే యూరిక్ యాసిడ్ కారణంగా వచ్చే గుండె జబ్బులు, రక్తపోటు, కిడ్నీ స్టోన్స్, ఆర్థరైటిస్ వంటి వ్యాధులతో పాటు షుగర్ కూడా అదుపులో ఉంటుంది. మరి, కాకరకాయను ఎలా తింటే ఆరోగ్యకరమో ఇప్పుడు తెలుసుకుందాం.

**యూరిక్ యాసిడ్ తగ్గాలంటే..**

కాకరకాయలో ఇనుము, మెగ్నీషియం, పొటాషియం, విటమిన్ సి, కాల్షియం, బీటా-కెరోటిన్, పొటాషియం వంటి విలువైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఔషధ గుణాలు పుష్కలంగా ఉండే కూరగాయకు యూరిక్ యాసిడ్, డయాబెటిస్‌లను నియంత్రించే లక్షణాలుంటాయి. ఒక గ్లాసు కాకరకాయ రసం యూరిక్ యాసిడ్‌ను సహజంగా తగ్గించే అద్భుతమైన ఔషధం.

**మధుమేహం**

కాకరకాయ మధుమేహ వ్యాధిగ్రస్తులకు కూడా చాలా ప్రయోజనకరం. రుచిలో చేదుగా ఉండే ఆకుపచ్చని కాకరలో విటమిన్ A, C, బీటా-కెరోటిన్, ఇతర ఖనిజాలు, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఈ కారణంగా ఇది ఇన్సులిన్ లాగా



పనిచేస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా నివారిస్తుంది.

**కాకరకాయను ఎలా తినాలి?**

ప్రతిరోజు ఉదయం ఖాళీ కడుపుతో అర కప్పు కాకరకాయ రసం తాగితే చాలా మంచిది. చేదును తొలగించడానికి కొద్దిగా నల్ల ఉప్పు లేదా నిమ్మకాయను జోడించవచ్చు. దీనిని తాగడం వల్ల గౌట్, ఆర్థరైటిస్ సమస్యలు మీ దరిచేరవు. కావాలంటే రసంతో పాటు, వివిధ రకాల కూరగాయలను కాకరతో కలిపి వండుకుని తినవచ్చు. ఇంకా కాకరపొడిని నీళ్లలో వేసుకుని కూడా తాగవచ్చు. కాకర పొడిని తయారు చేసేందుకు ముందుగా కాకరకాయను బాగా కడగాలి. తరువాత వాటిని కోసి నీడలో ఆరబెట్టి మెత్తటి పొడి చేసుకోండి. ఈ పొడిని ప్రతి ఉదయం సగం లేదా ఒక టీస్పూన్ నీళ్లలో వేసుకుని తాగండి.

## అల్లం ఇలా వాడితే కీళ్లనొప్పులు పరార్..

భారతీయ వంటకాల్లోనే కాదు. ఆయుర్వేదంలోనూ అల్లానికి ప్రత్యేక స్థానముంది. టీ, పచ్చళ్లు, మసాలాలు, కూరలు, ఫాస్ట్ ఫుడ్ ఇలా అల్లంతో అనేక పదార్థాలు తయారుచేయవచ్చు. ఇది ఆహార పదార్థాల రుచిని పెంచడంతో పాటు ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు చేకూరుస్తుంది. ఔషధగుణాలు సమృద్ధిగా ఉండే అల్లం జలుబు, దగ్గుతూ పాటు అనేక తీవ్రమైన వ్యాధులను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇందులో ఉండే ఇనుము, కాల్షియం, అయోడిన్, క్లోరిన్, విటమిన్లు శరీరాన్ని అనేక వ్యాధుల నుంచి కాపాడతాయి. అయితే, అల్లం ఎప్పుడు, ఎలా తినాలో తెలుసుకుందాం. అసిడిటీ: ఆహారం తిన్న తర్వాత కొందరు తరచూ ఆమ్లతత్వం లేదా అసిడిటీ సమస్యతో బాధపడుతుంటారు. గుండెల్లో మంట రేగి తీవ్ర ఇబ్బంది పడతారు. అలాంటి సమయంలో ఆహారం తిన్న 10 నిమిషాల తర్వాత ఒక కప్పు అల్లం రసం తాగండి. శరీరంలోని ఆమ్ల పరిమాణం నియంత్రణలోకి వస్తుంది.



వికారం, వాంతులు: అల్లం వికారం, వాంతులు తగ్గించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇది వికారం, మార్నింగ్ సిక్నెస్ లక్షణాలను తగ్గించడంలో సహాయపడుతుంది.

జీర్ణక్రియ: అల్లంలో జింజెరాల్ అనే బయోయాక్టివ్ సమ్మేళనం ఉంటుంది. ఇది జీర్ణ ఎంజైమ్‌లను ప్రేరేపించి జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. గ్యాస్, ఆమ్లతత్వం, ఉబ్బరం వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందడంలో కూడా సహాయపడుతుంది.

రోగనిరోధక శక్తి: అల్లంలో యాంటీఆక్సిడెంట్ లక్షణాలు ఉంటాయి. బలహీనమైన రోగనిరోధక శక్తి ఉన్నవారు అల్లం తగిన మోతాదులో తీసుకుంటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అంత ఈజీగా ఇన్ఫెక్షన్ల బారిన పడరు.

కీళ్ల నొప్పులు: అల్లం కీళ్ల నొప్పులను తగ్గించేందుకు సహాయపడే యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు కలిగి ఉంటుంది. దీనిని తినడం లేదా కీళ్లకు పూయడం వల్ల వాపు, నొప్పి తగ్గుతాయి.

ఋతుక్రమ నొప్పికి: ఋతుక్రమ నొప్పిని తగ్గించడంలో కూడా అల్లం ప్రభావవంతంగా పనిచేస్తుంది. దీనిలోని శోథ నిరోధక లక్షణాలు ఋతుక్రమ నొప్పిని తగ్గించి ఉపశమనం కలిగిస్తాయి.

**అల్లం ఎలా తీసుకోవాలి?**

సాధారణంగా అల్లంతో టీ తయారు చేసుకుని తాగుతుంటారు. కానీ, అల్లం వల్ల మరిన్ని ప్రయోజనాలు కావాలంటే టీకి బదులుగా దాని నీటిని తాగండి. అల్లం నీరు తయారు చేయడానికి ముందుగా దానిని తురుముకోవాలి. తర్వాత తురిమిన అల్లాన్ని ఒక గ్లాసు నీటిలో వేసి బాగా మరిగించాలి. ఇప్పుడు ఈ నీటిని ఫిల్టర్ చేసి టీ లాగా తాగండి. రుచి కోసం మీరు ఈ నీటికి ఒకటి లేదా రెండు స్పూన్ల తేనె జోడించవచ్చు.

